పలు కార్యక్రమాల్లో పాల్గొన్న హరీశ్‌రావు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో అమర్‌నాథ్ సేవా సమితి సభ్యులు

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 13: సిద్దిపేట పట్టణంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. సిద్దిపేటలోని బైరి అంజయ్య గార్డెన్‌లో జరిగిన అమర్‌నాథ్ సేవా సమితి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత

హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

గజ్వేల్, ఏప్రిల్ 13: ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే సీతారామ ఉమామహేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం గజ్వేల్‌కు వచ్చిన మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆలయ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, నిర్వాహకులు కొట్టాల యాదగిరి, నర్సింగరావు, శ్రీధర్, గంగిశెట్టి రవీందర్, స్వామిచారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

స్వామిని పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్

బెజ్జంకి, ఏప్రిల్ 13: మండలంలోని రేగులపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తాళ్ల స్వామి ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, ఐలయ్య, సతీశ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,ఏప్రిల్ 13: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రైతులకు సూచించారు. ఆదివారం ఉమ్మడి మిరుదొడ్డి అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి ఆర్థికంగా నష్టంపోవద్దని సూచించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాలరాజ్, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుర్తింపు లేకున్నా పాఠశాలలో అడ్మిషన్లు

వేచరేణిలో ఆదివారం అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న టీచర్లు

చేర్యాల, ఏప్రిల్ 13 : చేర్యాల పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు స్వీకరిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ పాఠశాలకు గుర్తింపు లేకున్నా కొన్ని రోజులుగా సిబ్బంది అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం సిబ్బందిని గ్రామాలకు పంపి అడ్మిషన్ల కోసం యాజమాన్యం వేధిస్తున్నట్లు తెలిసింది. గత విద్యాసంవత్సరం కూడా ఈ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుని, అధికారులను మేనేజ్ చేసి శుభోదయ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో పరీక్షలు రాయించినట్లు తెలిసింది. విద్యాశాఖ అధికారులు తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో కృష్ణయ్యను వివరణ కోరగా శ్రీ చైతన్య పాఠశాలకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. సీబీఎస్ఈ సిలబస్ చెబుతున్నాం.. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి అని కొన్ని పాఠశాలల నిర్వాహకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. శుభోదయ పాఠశాలకు మాత్రమే గుర్తింపు ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని ఆయన కోరారు.

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి

స్వామివారిని దర్శించుకున్న యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కర్‌రావు తదితరులు

చేర్యాల, ఏప్రిల్ 13: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఆదివారం సుమారు 12వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాదగిరిగుట్ట ఈవో భాస్కర్‌రావు కుటుంబంతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో అన్నపూర్ణ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరి పంట దగ్ధం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని మీర్జాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో వరి పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన పొన్నాల కళ అనే మహిళకు చెందిన వ్యవసాయబావి సమీపంలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ అయి నిప్పురవ్వలు ఎగిసిపడి వరి పంట దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. పంటనష్టపోయిన బాధితురాలికి ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- 10 మందికి గాయాలు

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 13 : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో 10 మందికి గాయాలైన ఘటన కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. కరీంనగర్ పద్మనగర్‌కాలనీ వాసులు హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో జరిగే బంధువుల పెండ్లికి ప్రైవేట్ బస్సులో హాజరై తిరిగి కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో దుద్దెడ టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న రుద్ర లత, లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలు కాగా ఓడెమ్మ, శ్రీలత, రుద్ర రాజ్‌కుమార్, అన్విత్, రాజవ్వ, మాధవి, జైదేవ్, సహస్రలకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమచికిత్స చేసి వారిని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

పేద రెడ్డి కుటుంబాలను ఆదుకోవాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 13: సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం ద్వారా పేద రెడ్డి కుటుంబాలను ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు.ఆదివారం రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం భవనాన్ని సుమారు రూ.4కోట్లు ఖర్చుచేసి నిర్మించామన్నారు. పట్టణంలో మొట్టమొదటి ఏసీ హాల్ ఇదేనన్నారు. పేదరికంలో ఉన్నవారిని ఆదుకోవడానికి కృషి చేయాలన్నారు. పేద రెడ్డి విద్యార్థుల చదువుకు సంఘం సహకారం అందించాలన్నారు. సంఘం తమకు అండగా ఉంటుందనే భావన పేదవారికి కల్పించాలన్నారు. చదువే వారి పేదరికాన్ని దూరం చేస్తుందన్నారు. పేదలకు సహాయం చేసే పనులకు పూర్తి సహకారం అందిస్తానన్నారు. రాజా బహుదూర్ వెంకట రామిరెడ్డి స్ఫూర్తితో సిద్దిపేట సంఘం సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతిభ కనబర్చే విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం భవిష్యత్‌లో ఎలాంటి సహకారం కావాలన్నా పూర్తి స్థాయిలో అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నూతన అధ్యక్షుడు వంగ తిరుమల్‌రెడ్డి, రెడ్డిసంఘం నాయకులు మాణిక్యరెడ్డి, వంగ నాగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నాగరాజురెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ రాంరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

కేసీఆర్ చొరవతో నంగునూరు అభివృద్ధి

సీతారామచంద్ర స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 13: ''కష్టపడి కాళేశ్వరం నీళ్లు తెచ్చుకున్నాం.. బంగారం లెక్క పంటలు పండినాయి.. అనుకునే లోపే రాళ్ల వానతో నోటికాడి బుక్క కింద పడ్డట్టు అయ్యిందని'' మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని రాంపూర్‌లో సీతారామచంద్ర స్వామి దేవాలయ రథోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ చొరవతో నంగునూరును అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఒకప్పుడు బోరు వేస్తే దుబ్బ తప్పా చుక్క నీరు రాకుండే.. కానీ ఇప్పుడు ఏప్రిల్‌లో చెరువులు, చెక్‌డ్యామ్‌లు మత్తడి దుంకుతున్నాయన్నారు. ఎండాకాలంలోనూ చెరువులు నిండుతాయని, కాలువలు పారుతాయని బ్రహ్మంగారి కాలజ్ఞానంలో కూడా చెప్పని మాటలు నేడు చూస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ త్వరలోనే ప్రారంభమవుతుందని, దానితో స్థానికంగా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. యువత బెట్టింగ్ యాప్స్, తాగుడుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డబ్బులు సంపాదించడానికి షార్ట్‌కట్ మార్గాలను అన్వేషించకుండా కష్టాన్ని నమ్ముకొని ముందుకు సాగాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, తాగుడుకు బానిస కాకుండా రాముని మీద ప్రమాణం చేసి తల్లిదండ్రుల కలలు, ఆశయాలను నిజంచేసేలా యువత సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'పల్లా'ని విమర్శిస్తే సహించేది లేదు

మాట్లాడుతున్న మంద యాదగిరి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్13: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి తెలిపారు. ఆదివారం ఆయన ధూళిమిట్టలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిల్లరమల్లర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మాటిమాటికి దొంగ ఓట్లు అంటూ ఎన్నికల విధానాన్ని కొమ్మూరి అపహస్యం చేస్తున్నారని, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న పల్లాని విమర్శిస్తే సహించేది లేదన్నారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు వెంకట్‌గౌడ్, సాగర్, భిక్షపతి, కనకయ్య, శ్రీనివాస్, కృష్ణ, యాదగిరి, తిరుపతి, అజయ్, శివ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలి

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని పందిల్ల మీదుగా వెళ్తున్న ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పందిల్ల శివారులో బ్రిడ్జి పక్కన వేసిన తాత్కాలిక రోడ్డును ఆయన పరిశీలించారు. తాత్కాలికంగా వేసిన రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్‌గౌడ్, సునీత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జీడిపల్లి రాంరెడ్డి

తొగుట, ఏప్రిల్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దొడ్డు రకం ధాన్యానికి సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని లింగంపేటలో వరిపొలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం సన్నం ధాన్యానికి మాత్రమే ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే అవుతుందన్నారు.10 లక్షల మందికి పైగా రైతులకు పంట రుణ మాఫీ కాలేదన్నారు. రైతుభరోసా నేటికీ ఇవ్వడం లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు దండుగ అన్న కాంగ్రెస్ నాయకులు నేడు కరువుకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఆదుకుంటున్నదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలోనే మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులతో పాటు ప్రధాన కాలువలు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శ్రీధర్, బాలేష్‌యాదవ్, మహ్మద్ జహంగీర్, కమలాకర్, రాంబాబు పాల్గొన్నారు.

హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలి

చేర్యాలలో టీఎస్‌యూటీఎఫ్ జెండావిష్కరిస్తున్న ఉమారాణి

చేర్యాల, ఏప్రిల్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకురాలు కాసం ఉమారాణి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, దీర్ఘకాలిక పెండింగ్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాటం శ్రీనివాస్, పురుషోత్తం, కనకారెడ్డి, ప్రసాద్, మల్లికార్జున్, చంద్రమౌళి, సంపత్ పాల్గొన్నారు.

ఓబీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీపీ మండల్ వర్ధంతిలో పాల్గొన్న బీసీసంఘం నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 13: చట్టసభల్లో ఓబీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రధాని మోదీ కృషి చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరప్రసాద్ మండల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ నాటి మండల కమిషన్ సిఫార్సుల మేరకు ప్రధాన మంత్రి వీపీసింగ్ హయాంలో ఓబీసీలకు విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మండల్ కమిషన్ స్ఫూర్తిగా ఓబీసీలు తమహక్కుల కోసం మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం నాయకుడు రాజు అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుభాశ్, అయిలేష్ యాదవ్, మల్లేశం, శ్రీనివాస్‌నాయక్, సందీప్ పాల్గొన్నారు.

అవిశ్రాంత ఉపాధ్యాయుడు

- పైసా ఆదాయం లేకపోయినా.. పేద పిల్లలపై మక్కువ
- మండలంలోని తీగుల్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి నేటి తరానికి ఆదర్శం

ఉద్యోగ విరమణ చేసినా 19 ఏండ్లుగా బోధన

విశ్రాంత ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

జగదేవపూర్, ఏప్రిల్ 13 : ఉద్యోగ విరమణ అనేది వయస్సుకు మాత్రమే ఉంటుంది మనస్సుకు కాదు అని నిరూపిస్తున్నాడు అవిశ్రాంత ఉపాధ్యాయుడు. గురువు అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాడు 78 ఏండ్ల వృద్ధ ఉపాధ్యాయుడు. టీచర్ కొలువొస్తే చాలు లక్షల్లో జీతం తీసుకుందాం, ఖాళీ సమయం దొరికితే ఇతర వ్యాపారాలు చేసుకుంటూ సంపాదించాలని ఆలోచించే నేటి ఆధునిక యుగంలో పైసా ఆదాయం లేకపోయినా సొంత ప్రయాణ ఖర్చులు భరిస్తూ ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా సర్కారు బడిలో పేద విద్యార్థులకు 19 ఏండ్లుగా ఉచిత బోధన చేస్తున్న మాస్టారుపై నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం..

వ్యవసాయ కుటుంబంలో జన్మించి..

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి సాధారణ మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. చదువుతోనే జీవితంలో రాణిస్తామని చెప్పిన తల్లిదండ్రులు, గురువుల మాటలతో ఆయన స్ఫూర్తిపొంది ఉన్నత విద్య అభ్యసించి ఉపాధ్యాయుడిగా నియామకమయ్యారు. 1970 లో ములుగు మండలం అచ్చాయపల్లె లోని స్కూల్‌లో మొట్టమొదట ఉపాధ్యాయుడిగా చేరారు. అక్కడ నుంచి పలు ప్రభుత్వ పాఠశాలల్లో మూడు దశాబ్దాల పాటు విధులు నిర్వహించారు. ఎక్కడ పని చేసినా అంకిత భావంతో బోధన చేసి అందరి మన్ననలు పొందారు. 2004లో జగదేవపూర్ మండలం అనంతసాగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్డుకు ముందే బాల్‌రెడ్డి గజ్వేల్ పట్టణంలో స్థిరపడ్డారు. రిటైర్డు అయిన కొన్ని నెలల పాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్న తర్వాత తిరిగి బోధన చేపట్టాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడువుగా గజ్వేల్ సమీపంలోని దాచారం క్యాసారం, ప్రజ్ఞాపూర్ తదితర గ్రామాల సర్కారు బడుల్లో బోధన చేశారు.

తీగుల్ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న బాల్‌రెడ్డి

బాల్‌రెడ్డి మాస్టారు

అవిశ్రాంత ఉపాధ్యాయుడికి ప్రశంసలు

ఉద్యోగ విరమణ తర్వాత కూడా సర్కారు బడిలో పాఠాలు బోధిస్తున్న బాల్‌రెడ్డి మాస్టారుపై సోషల్ మీడియాలో కథనాలు వస్తుండటం.. ప్రశంసల వర్షం కురుస్తోంది. నేటి తరం ఉపాధ్యాయులకు బాల్‌రెడ్డి మాస్టారు గొప్ప ఆదర్శం అని పలువురు ప్రశంసించారు. ఈ విషయం తెలుసుకున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి మాధవ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం సైదులుతో కలిసి బాల్‌రెడ్డి మాస్టారును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

సొంత గ్రామం తీగుల్‌లో పాఠాలు బోధిస్తూ..

తాను పుట్టిన సొంత గ్రామానికి (తీగుల్) ఏదో చేయాలనే సంకల్పంతో నిత్యం గజ్వేల్ నుంచి 15 కిలోమీటర్లు ఆటోలో ప్రయాణం చేసి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం బోధిస్తున్నాడు. వయస్సు మీద పడుతున్నా దశాబ్దకాలంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులకు బోధన చేస్తున్నాడు. సర్కారు పాఠశాలల్లో పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలు చదువుకుంటారని, వారికి మంచి విద్యనందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉన్న సంతోషం మరెక్కడా దొరకదని బాల్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావుకు సన్మానం

నారాయణరావుపేట, ఏప్రిల్ 13 : తెలంగాణ ఎమ్మెల్యేల పనితీరుపై ఓ సంస్థ చేసిన సర్వేలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాష్ట్రంలో మొదటి స్థానం దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావును నాయకులు శాలువాతో సన్మాని ంచగా తిరిగి గ్రామానికి చెందిన వృద్ధుడు పల్లెపు పాపయ్యను హరీశ్‌రావు శాలువాతో సన్మానం చేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యంకన కేంద్రం సందర్శన

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 13: సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్త్ మూల్యంకన కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి ఆదివారం సందర్శించినారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎగ్జామినార్, ఎగ్జామినార్‌కు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేటి నుంచి సాధికారత ప్రచారోద్యమం

గజ్వేల్, ఏప్రిల్ 13: డీబీఎఫ్ ఆధ్వర్యంలో నేటి నుంచి దళిత బహుజన సాధికారత ప్రచారోద్యమాన్ని చేపడుతున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. ఆదివారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఎర్రవల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి, మైసయ్య పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం 45,81,77,096 కోట్లు

చేర్యాల, ఏప్రిల్ 13: కొమురవెల్లి మల్లికార్జున స్వామి వార్షిక ఆదాయ, వ్యయాలను ఆలయ ఈవో అన్నపూర్ణ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2024-25 సంవత్సర నికర ఆదాయం రూ. 20,97,93,956 వచ్చిందన్నారు. గత సంవత్సరం నికర ఆదాయం కంటే రూ. 2,23,29,490 అధికంగా సమకూరిందన్నారు. వార్షిక ఆదాయం రూ. 45,81,77,096 కోట్లు చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

కోహెడ, ఏప్రిల్ 13: మండలంలోని కూరెల్ల గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా 12 టన్నుల ఇసుకను డంపు చేశారు. పక్కా సమాచారంతో ఆదివారం కోహెడ పోలీసులు ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

గజ్వేల్, ఏప్రిల్ 13: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సాయిదంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ని